

వృథాగా తాగునీరు

విశాలాంధ్ర - పోలాకి: మండలంలో స్థానిక విశ్వేశ్వరనగర్ కాలనీలో త్రాగునీటి కుళాయి మరమ్మత్తు కారణంగా నీరు వృథాగా పోతుందని తక్షణమే అధికారులు పట్టించుకోవాలని స్థానిక కాలనీవాసులు తెలిపారు. ఈ విదంగా నీరు వృథా అవుతుండం వలన ఎగువ, శివారు ప్రాంత ప్రజలకు త్రాగునీరందక ఆ ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఒక ప్రక్క త్రాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్న సంగతి పంచాయతీ అధికారులకు తెలిసి కూడ చర్యలు చేపట్టకపోవడం విచారకరమని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయితీ అధికారులు, నిర్వహణా సిబ్బంది గుర్తించి సత్వర చర్యలు చేపట్టి త్రాగునీరు వృథా కాకుండా

ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామీణ గృహానికి తాగునీరు అందించాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. రూరల్ మండలం కిష్టప్ప పేటలో జల్ జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించి మాట్లాడారు. ప్రతి కుటుంబానికి సురక్షిత మంచినీరు అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి కొళాయి కనెక్షన్‌ను ఇవ్వడం జరుగుతోందన్నారు. జల్‌జీవన్ మిషన్ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. పథకంలో భాగంగా వేస్తున్న పైప్ లైన్లను, డ్రైన్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.

తాటిపాలమ్మ తల్లి మహోత్సవాలు

విశాలాంధ్ర-నందిగాం: మండలం నందిగాం పంచాయతీ పెంటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన తాటిపాలమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం నాలుగు గంటలకి అమ్మవారి విగ్రహాలను తిరువీధుల్లో ముర్రాటాలతో ఊరేగించి ఆలయ ప్రాంగణానికి చేర్చి శుక్రవారం విగ్రహాలను ప్రతిష్టిస్తామని నిర్వాహకులు తెలిపారు.

మొక్కలతోనే మానవ మనుగడ

విశాలాంధ్ర - కవిటి: మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని నవ యువ చైతన్య యువజన సంఘ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నవ యువ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో బెలగాం పంచాయతీ జాడుపూడి ఆర్ఎస్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నవ యువ చైతన్య యువజన సంఘ సభ్యులకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాడుపూడి ఆర్ఎస్, బెలగాం గ్రామాల పెద్దలు, నవ యువ చైతన్య యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ హౌసింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులను చైతన్య పరిచే విధంగా మాట్లాడి అసంపూర్తిగా వదిలేసిన గృహాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హౌసింగ్ ఇంజనీరింగ్ శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఐతమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర - టెక్కలి: ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఈసిఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇప్పిలి జయకు జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్శిటీ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిటెక్షన్ ఆఫ్ మూవింగ్ టార్గెట్స్ అమాంగ్ క్లట్టర్ యూజింగ్ ఎఫ్ఆర్ఎఫ్ టి ఫజ్జి, హైబ్రీడ్ ఆప్టిమైజేషన్ మెథడ్ యూజింగ్ ఎస్ఎఆర్ టెక్నిక్స్ అనే అంశంపై జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ బిటి.క్రిష్ణ మార్గదర్శ కత్వంలో చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీ లభించింది. జయను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్.శ్రీనివాసరావు, ఆరెండ్డీ డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్ఐడి డాక్టర్ వి.అశోక్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సమాజ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం కీలకం

విశాంలాంధ్ర - కొత్తూరు: శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కాలేజ్‌లో లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాంపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ బి.సి.డి.ఈ. సమన్వయకర్త డాక్టర్ బి.అజయ్ కుమార్ మాట్లాడుతూ సమాజం ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థుల వల్ల సామాజిక సేవ మెరుగవుతుందని విద్యార్థులు తలుచుకుంటే దేశం ప్రగతి పథంలోకి వెళ్లడం తథ్యమన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ ఆర్.అప్పారావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ అమలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల బిసిడిఈ కోఆర్డినేటర్ జి.మహేష్ బాబు, సాంకేతిక అధ్యాపకులు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎర్రన్నాయుడు విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-సోంపేట: మండలం అనంతపురం గ్రామంలో మహాయజ్ఞం సందర్భంగా గ్రామస్తులు కేంద్ర మాజీ మంత్రి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి గౌతు శ్యామసుందర శివాజీ చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎర్రన్నాయుడు మంత్రిగా అనంతపురం గ్రామానికి అందించిన సేవలను ఎన్నటికి మర్చిపోలేమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గౌతు విజయలక్ష్మి, టీడీపీ నేత జీకే నాయుడు, గ్రామస్తులు, చైతన్య దీపిక ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు నేటికీ అందని గుడ్లు...!

విశాలాంధ్ర - ఆమదాలవలస: చిన్నారులకు పోషక విలువలు పెంపొందించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించడంలో భాగంగా ప్రభుత్వం వారికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. అందులో భాగంగానే చిన్నారులకు పౌష్టికాహారం అందించడానికి గుడ్డును రోజూ అందిస్తారు. ముందు నెల 25వ తేదీ నుంచి నెల మొదటి రోజుకి సంబంధిత ఏజెన్సీ వారు అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు అందించాల్సి ఉంది. నేటికి పది రోజులు గడుస్తున్న ఇంకా గుడ్లు వేయలేదు. ఈ నాలుగు రోజులు పాత వాటితో సరి పెట్టి మొదటి విడత గుడ్లు పంపిణీకి మంగళం పాడనున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆముదలవలస ఐసీడీఎస్ పరిధి పట్టణము, మండలం మొత్తం 117 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. బూర్జ, సరుబుజ్జిలి 147 కేంద్రాలు ఉన్నాయి. ఆముదాలవలస ఐసిడిఎస్ పరిధిలో పొందూరుకు వేరే ఏజెన్సీ ఉంది. ఆమదాలవలస బూర్జికి మాత్రం ఇప్పటికీ గుడ్లను అందించలేదు. నాలు గు విడతలుగా కేంద్రాలకు వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఆముదాల వలసకు మొద టివారం, మూడవ వారం 36,850 వంతున రెండు వారాలు వేయవలసి ఉంటుంది. అలా గే రెండవ వారం నాలుగో వారం 5150 వంతున కేంద్రాలకు అందించాలి. 117 కేంద్రాలకు 84 వేల గుడ్లను నాలుగు విడతలుగా అందించాలి. అలాగే బుజ్జి 147 కేంద్రాలకు గాను 88 వేల గుడ్లను అందించాల్సి ఉంది. ఒకటి, మూడు వారాలలో 38,150, రెండు నాలుగు ఒక్కొక్క వారాలలో 5150 గుడ్లు అందించాలి. పది రోజులు గడుస్తున్న నేటికీ వాటిని అందించలేదు. అలాగే ఆముదాలవలస ప్రాంతంలో బాలామృతం కూడా నేటికీ అందలేదని సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ఐదవ తేదీ నుంచి పదవ తేదీలోగా రెండో వారం సరుకులు కూడా అందించాలి. అంటే మొదటివారం పూర్తి చేసినట్లే రికార్డులు నమోదు చేసుకుని ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే కొన్ని కేంద్రాలను దగ్గరలో ఉన్న పెద్ద కేంద్రాలకు విలీనం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు ఆయాలు నలుగురు ఉన్నప్పటికీ కొన్ని కేంద్రాలు నిత్యం మూసివేసి ఉంటున్నాయి. ఐజ నాయుడు కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రానిది అదే దుస్థితి. స్థానిక తెలుగుదేశం నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఒక్కొక్కరు ఒక్కో కేంద్రానికి మద్దతు పలుకుతున్నట్లు అందుకే వారు విద్యార్థులకు కనీసం పౌష్టికాహారం అందించడం లేదని స్థానికులు అంటున్నారు. కళాశాల వద్ద ఉన్న 12, 13 వార్డులకు సంబంధించిన కేంద్రాలు కూడా

మూతబడ్డ ఐజె నాయుడు కాలనీ కేంద్రం

ఇదే పరిస్థితి. ఆ కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలు 22 మంది ఉన్నప్పటికీ ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వం అందించిన మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. 12వ వార్డులో తాళ్ల శివాని అనే అనాథ బాలికను గుర్తించారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో వారికి నేటికీ చోటు దక్కలేదు.

అంగన్వాడీ కేంద్రంలో ఇద్దరే చిన్నారులు

కేంద్రాలను ఎప్పటికప్పుడు ఉన్న తాధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చిన్నారులకు రక్తహీనతలు లేకుండా పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరు అధ్వానంగా కని పిస్తుంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనితీరు పాలకుల పర్యవేక్షణ ఉండాల్సి ఉన్నప్పటికీ అటువంటి పరిస్థితులు కానరావడం లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వా త పాత ఏజెన్సీలను మార్పు చేసే క్రమంలో ఆముదాలవలస లో కూడా ఏజెన్సీ మార్పు జరిగింది. అయితే వారు కొత్తవారు కావ డంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఆవశ్యకతలు తెలియక వ్యాపార ధోరణి గాని ఏజెన్సీలు వ్యవహరించటం ఇటువంటి దుస్థి తిని కారణమవుతుందని పలువురు వాపో తున్నారు. పథకాలను పేదవారికి క్షేత్రస్థా యిలో అమలు చేయాల్సిన అధికారులు పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇటువంటి పరిస్థితి ఎదురయ్యేది కాదని స్థానిక ప్రజానీకం అంటున్నారు. ఈ విషయమై స్థానిక ఐసీడీఎస్ పిఓ అనురాధను వివరణ కోరగా కొత్త ఏజెన్సీలు వచ్చాయని త్వరలోనే పూర్తిస్థాయి ఆహార వస్తువులనంది స్తామన్నా రు. ఎవరైనా విద్యార్థులకు సరుకులు అందిం చడం లేదని ఫిర్యాదు వస్తే చర్యలు చేపడతామన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో వెంకటేశ్వర విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: గత నెలలో చండీఘడ్లో జరిగిన జాతీయ స్థాయి (వినుస్కుడ్ -2024) క్రికెట్ పోట్లో ఆంధ్రా జట్టు తరపున పాల్గొన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో ప్రథమ సంవత్సరం విద్యార్థి నంబాల సుశాంత్ ప్రతిభ కనబరిచాడు. లీగ్ పోటీల్లో చండీఘడ్ జట్టుపై సుశాంత్ 62 బాల్స్కు 53 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డాడు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన ఈ విద్యార్థిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీపీ రమణమూర్తినాయుడు అభినందించారు.

మద్యం షాపుల్లో సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ నాయకులు కొన్న

విశాలాంధ్ర - నరసన్నపేట: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం షాపుల్లో పనిచేసిన సిబ్బందికి కూటమి ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం షాపులను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసి, అర్హులైన అభ్యర్థులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా 15,000 మందిని ఎంపిక చేసిందని, అయితే 2024వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రైవైటీకరణ చేయటం వలన గతంలో పనిచేసిన 15,000 మంది అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోవటంతో వారి కుటుంబాలు నేడు రోడ్డున పడ్డాయన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరితగతిన స్పందించి, ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థులకు ఉద్యోగ భద్రత కల్పించి, బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం జిల్లా వైన్ షాపుల సూపర్‌వైజర్స్, హెల్పర్స్ యూనియన్ నరసన్నపేట నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎంపికలో నియోజకవర్గ అధ్యక్షునిగా వి.వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా జి.రాజా రావు, కార్యదర్శిగా కె.రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా వై.రామారావు, కె.క్రాంతికుమార్, కోశాధికారిగా బి.వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు బి.సంతోష్ పాల్గొన్నారు.

జానకికి మూడు సెంట్లు ఇళ్ల స్థలం

కలెక్టర్ చేతుల మీదుగా అందజేత

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామని చెందిన బలిజపల్లి జానకికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు 3 సెంట్ల ఇళ్ల స్థలాన్ని మంజూరు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు డాక్టర్ బెందాలం అశోక్ సంయుక్తంగా లబ్ధిదారురాలకు ఇళ్ల పట్టా పంపిణీ చేశారు. దీపం 2 పథకాన్ని ప్రారంభించేందుకు ఈదుపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటరి మహిళ పెన్షన్ను ఆమెకు అందజేశారు. ఆమె అభ్యర్థన మేరకు ఇళ్ల పట్టా ఇస్తానని అప్పుడు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ వారం తిరగకుండా అమలు జరిగినందుకు లబ్ధిదారురాలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కలకాలం పేదలకు అండగా ఉంటుందని ఆమె ఆశీర్వదించారు.

ఎమ్మెల్యేను కలిసిన 104 సిబ్బంది

విశాలాంధ్ర - రణస్థలం: తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గంలో ఉన్న 104 సిబ్బంది స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకి తన క్యాంపు కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని ఇలా అయితే కుటుంబాలను ఎలా పోషించాలని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం ఒక్కనెలకు 50 వేలు రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజా ధనం వృథా కాకుండా చూడాలని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డి.ఈ.ఓకు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.ఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డి.యస్సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది కె.ఉష, కె.రామారావు, మురళి, గౌరీశంకర్, రమేష్, సాయి, ఎ.సత్యవతి, సత్యం, శంకర్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

శివసాగర్ బీచ్ అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర - పలాస: వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి రెవెన్యూ భూభాగం బైపల్లి తీరప్రాంతంలో ఉన్న శివ సాగర్ బీచ్ అభివృద్ధికై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహశీల్దార్ స్వామి నాయుడు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా బీచ్‌లో కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ టూరిజం శాఖ ఆధ్వర్యంలో శివ సాగర్ బీచ్ అభివృద్ధికి ఐదు ఎకరాలు కలిగిన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారని అన్నారు. ఆ మేరకు స్థలాన్ని రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందించనున్నామని పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా కలెక్టర్లు, ఆర్డీవోలు మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి చూసి వెళుతున్నారు తప్ప ఈ బీచ్‌కు ఏ విధమైన మోక్షం కలగడం లేదని, నిధులు మంజూరు కావడంలేదని, కంటి తుడుపు చర్యలే మిగులుతున్నాయని ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లగా దానిని టూరిజం శాఖ చూసుకోవాలని, రెవిన్యూ స్థలం అప్పగించడమే తమ బాధ్యత అని తహశీల్దార్ స్వామి నాయుడు సమాధానం ఇచ్చారు. ఈ పరిశీలనలో ఆర్ఐ వెంకటరావు, అక్కుపల్లి విఆర్ఓ, బైపల్లి గ్రామ సంఘ అభివృద్ధి కమిటీ సభ్యులు కోనేరు కామేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా ఎంపీ కలిశెట్టి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఎచ్చెర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు పైడి ముఖలింగం, గాలి వెంకటరెడ్డి, మెండ రాజారావు, పంచిరెడ్డి సత్యనారాయణ, పైడి అన్నంనాయుడు, గట్టెం శివరామ్, పంచిరెడ్డి కృష్ణారావు, మూకళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేపై గ్రామ సభ

విశాలాంధ్ర-కంచిలి: మండలం శ్రీరాంపురంలో భూ సర్వేపై గ్రామ సభ ని రెవిన్యూ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు మాట్లాడుతూ గతంలో జరిగిన భూ సర్వే లో లోపాల్ని సరిచేస్తాం అన్నారు. ఈ కార్యక్రమం లో రైతు ప్రతినిధులు జి ప్రసాద్, మాదిన ప్రదీప్, కాంతారావు, గ్రామస్తులు రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోగులకు సరైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - జలుమూరు: అనేక ప్రాంతాల నుండి వచ్చే రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందించాలని నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం బుడితి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి సమావేశం చైర్మన్ మండల అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యశాలలో రోగులకు సరైన వైద్యం అందించాలని సాధ్యమైనంత వరకు రిఫరల్ కేసులు తగ్గించి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి నూతన కమిటీ సభ్యులచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఆసుపత్రి అభివృద్ధికి కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజన కుమారి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, స్థానిక సర్పంచ్ పొన్నాన శంక రావు, ఆ పార్టీ నేతలు సారవకోట రామారావు, సురవరపు తిరు పతిరావు, అక్క జ్యోతిష్యులు దత్తు బాబు వైద్య సిబ్బంది పలువురు అభిమానులు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న రోగులను పరిశీలించి అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సారవకోట మండలం, బుడితి సామాజిక ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ సలహా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యం అందించి వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్పిటల్ నూతనకమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కింజరాపు చరిత్రపై విమర్శలు మానుకోవాలి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: 40 సంవ త్సరాలు చరిత్ర కలిగి, ప్రజలతో మమేకమైన కింజరాపు పాలనపై వాస్తవాలు తెలుసుకోవాలని, వాస్తవాలు తెలియకుండా విమర్శలు చేయడాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను మానుకోవాలని మేఘవరం, మరువాడ పంచాయతీ టీడీపీ నాయ కులు, మాజీ మండల ఉపాధ్యక్షులు సూరాడ భీమారావు అన్నారు. గురువారం మేఘవరంలో ఆయన మాట్లాడుతూ సంతబొమ్మాళి మండలం మేఘవరం గ్రామంలో 2014-2019 మధ్య ఈనాడు సంస్థల సౌజన్యంతో హుద్ హుద్ తుఫాన్ ఇల్లు పేదలకు నిర్మించారని, నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ జరగలేదన్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది లబ్ధిదారులకు పట్టాలు కలెక్టర్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిందని, మంత్రి అచ్చెన్నాయుడుపై ఆరోపణలు సబబు కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరపటి కళా రాజశేఖర్ రెడ్డి, మత్స్యకార నాయకులు సురాడ ధనరాజు, మండల తెలుగు యువత ఉపాధ్య క్షులు సూరాడ రాయుడు, మండల తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి దీర్ఘాశి జయరామ్ రెడ్డి, దీర్ఘాశి పోతయ్య, పరపటి వినోద్ కుమార్ నందుపల్లి రామారావు, మాజీ సర్పంచ్‌లు వంక సోమేశ్వరరావు, మేరుగు నూకయ్య, నాయకులు బైపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం: డీఐజీ

విశాలాంధ్ర - సోంపేట: రాష్ట్రంలోను, దేశంలోను కొంతకాలంగా జరుగుతున్న సైబర్ నేరాల వలన బాధితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అటువంటి నేరాల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డిఐజి గోపినాథ్ జెట్టి పేర్కొన్నారు. శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి గురువారం సోంపేట పోలీస్ స్టేషన్‌తోపాటు బారువలో గల మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సోంపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు ద్వారా ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. పలు రకాల ఆశలు చూపి అధిక లాభాలు వస్తాయని ప్రలోభాలకు గురి చేసి ఉద్యోగాల ఆశ చూపి డబ్బులు ఎరవేయడం, మోసాలకు పాల్పడడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సీఐ మంగరాజు, ఎస్సై హైమావతి, బారువ, కంచిలి, మందస ఎస్సైలు పాల్గొన్నారు.

రైతు బాంధవ్యుడు ఎన్జీ రంగా

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: రైతు బాంధవ్యుడు, పద్మవిభూషణ్ రైతుల కోసం జీవితాంతం అలుపెరగని ఉద్యమాలతో రైతుల వెన్నంటి ఉన్న మహోన్నత వ్యక్తి ఆచార్య ఎన్జీ రంగా అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీజీ స్మృతి వనంలో ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే శంకర్ గురువారం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరువాకను జోరువాకగా మార్చి రైతుల జీవితాలలో వెలుగులు నింపేందుకు చట్టసభల లోపల, వెలుపల అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిన రైతు పక్షపాతి ఎన్జి రంగా అని చెప్పారు. బ్రిటీష్ వారితో మాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరించినందుకు రాజాజీ.. రంగాకు సర్దార్ బిరుదు ఇస్తామని చెప్పగా.. తన శిష్యుడు గౌతు లచ్చన్నకు ఇప్పించి నిస్వార్థపరుడిగా పేరొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో సురంగి మోహనరావు, పొన్నాడ రవి కుమార్, గాంధీ మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని ఎమ్మెల్యే బగ్గు పరామర్శ

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం మూర్తి గ్రామానికి చెందిన పురాతన వైద్యుడు డబ్బురి వినోద రావు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి గురువారం ఆయన పరామర్శించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న మరో వ్యక్తిని పరామర్శించారు. ఆయనతోపాటు మండల అధ్యక్షులు కూర్మినాయుడు, టిడిపి అధికార పార్టీ ప్రతినిధి ధర్మానతేజ్ కుమార్, మండల టిడిపి అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, స్థానిక సర్పంచ్ పొన్నాన శంకర్రావు నేతలు పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గంలో కరువు ఛాయలు... ఆందోళనలో అన్నదాతలు..!

విశాలాంధ్ర-పలాస/మందస : వరుణుడు సకాలంలో కరుణించకపోవడంతో పలాస నియోజకవర్గం పరిధి పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఆలుగాలం అన్నదాతలు కష్టించి పండిస్తున్న వరి పంట చేలుకు సరైన సమయంలో సాగునీరు అందకపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర, ఒడిస్సా రాష్ట్రంలో అల్పపీడనలు,వాయుగుండాలు, తుఫాన్లు ఇటీవల కాలంలో ఉన్నప్పటికీ తుఫాన్ల ప్రభావం ఈ ప్రాంతంలో లేక వర్షాలు కురియకపోవడంతో రైతుల పొలాలకు సాగునీరు కొరత వెంటాడుతుంది. ప్రస్తుతం పొట్ట దశలో వరి పంట ఉంది. వర్షాలు లేక సాగునీరు సాగునీటి కాలువల్లోను, చెరువుల్లో లేకపోవడంతో పాటు ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దీంతో పొలాలు బీటలు వారిపోయి వరిచేలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో అక్కడక్కడ సాగునీరు లభ్యత ఉన్నచోట్ల 20 శాతం వరకు వరి పంట పండుతోంది. దుక్కిలు,విత్తనాలు, వరి నారు పండించడం, ఉడుపులు, ఎరువులు కొనుగోలు కోసం వడ్డీ వ్యాపారులతో అప్పులు చేసి ఒక్కొక్క రైతు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం వరి పంట ఎండిపోతుండడం, పంట చేతికి దక్కే పరిస్థితులు కనిపించకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట చేలుకు సాగునీరు సరఫరా లేకపోవడంతో పాటు వేలాది ఎకరాల వరి పంట ఎండిపోతుండంతో రైతులు కంటనీరు తలపిస్తున్నారు. వరి పంట దక్కేందుకు పడిన శ్రమ వృధా అయింది. ఓరి పంట కోసం చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతుంది. కనీసం ఏడాది పాటు కుటుంబానికి సరిపడే తిండి గింజలు కూడా ఇంటి దరికి చేరే పరిస్థితులు కనిపించకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. తీవ్ర కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డిసెంబర్ 4 విజయవాడలో జరిగే ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయండి

పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ శంకర్

విశాలాంధ్ర-పలాస: విజయవాడలో డిసెంబర్ 4న జరిగే ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ శంకర్ కోరారు. గురువారం పలాస కాష్యూ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఈ నేల నుండి ఫాసిస్ట్ ప్రభుత్వంను పారద్రోలాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి బగత బంగార్రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు కిరణ్‌లు మాట్లాడుతూ రష్యాలో విజయవంతమైన అక్టోబర్ సోషలిస్ట్ విప్లవ ఉద్యమంలో అమరులైన వారందరికీ,అమరుడు సాయిబాబాలకు నివాళు లర్పించారు. మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానం అజేయమైనదన్నారు. దేశ ప్రజలు అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలని కోరారు. కమ్యూనిస్టు ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సభ్యులు కామ్రేడ్ మద్దిల మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. డిసెంబర్ 4 వ తేదీన ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగు ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సూపర్ సిక్స్ లతో పాటు ప్రజల న్యాయమైన పీపుల్స్ సిక్స్ డిమాండ్లను నెరవేర్చాలని లేకుంటే ప్రజలు ఎదురు తిరిగే సమయం ఆసన్నమైందని జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు హెచ్చరించారు. కార్యకర్త లంతా ఉత్తేజంతో, శ్రీకాకుళం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడింగ్ సభ్యులు, బ్రాంచ్ కార్యదర్శులు, కమిటీ సభ్యులు, ఇచ్ఛాపురం, పలాస, మందస, టెక్కలి కార్యకర్తలతోపాటు మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్ రావు, దున్న శ్రీనివాస్, పి.కామేశ్వరరావు, అప్పారావు, జగదీష్, నాగేశ్వరరావు, దాలమ్మలు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన మహా యజ్ఞం

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం అనంతపురం గ్రామంలో శ్రీవేద గాయత్రి లోక కళ్యాణ మహాయజ్ఞం గురువారం ఎంతో వైభవంగా ప్రారంభమైంది. ఆర్య సమాజ ప్రచారకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య గురువారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో హెూమగుండాలను ప్రారంభించారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ దంపతులు హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొని మహా యజ్ఞాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలోని మహిళలు పెద్దసంఖ్యలో సమీపంలో మహేంద్రతనయ నది నుంచి తీసుకు వచ్చిన బిందెలతో మంచినీటిని యజ్ఞానికి ఉపయోగించారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులతో పాటు గ్రామానికి చెందిన పలువురు దంపతులు కూర్చుని తొలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని ఆర్య సమాజ ప్రచారకులు మాఘం కృష్ణమూర్తిశాస్త్రి, కుమారి నళిని, రావణ, కళ్యాణ రవీంద్రనాథ్, సాంబ శివయ్య తదితరులు ఈ మహాయజ్ఞ కార్యక్రమంలో మంత్రోచ్ఛరణలతో క్రతువును కొనసాగించారు. ఉదయం నుంచి యజ్ఞానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మామిడి గురుమూర్తి, బూర్లె ధర్మారావు, ప్రముఖ వ్యాపారవేత్త జీకే నాయుడు, గ్రామ యువకులు, గ్రామస్తులు, మహిళలు, సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్యదీపిక ప్రతినిధులు దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, బీన ఆనందరావు, బంజు లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 11న మినీ జాబ్ మేలా

విశాలాంధ్ర - నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11వ తేదీన ఉదయం 9.30గంటల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్. డా.పి.లత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 10వ తరగతి నుండి డిగ్రీ వరకూ చదువుకున్న విద్యార్థులతో పాటు ఐటిఐలో శిక్షణ పొందిన నిరుద్యోగులు ఈఉద్యోగకల్పనలో పాల్గొనవచ్చన్నారు. అలాగే ఈ ఉద్యోగ మేళాలో నవత ట్రాన్స్‌పోర్ట్, స్పందన, స్ఫూర్తి అనే కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హత కల్గిన నిరుద్యోగులు వారి విద్యార్హతల పత్రాలు, ఆధార్ కార్డు, 2పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్ నెం-9949900672కు సంప్రదించాలని తెలిపారు.

బాలల సంరక్షణకు కృషి

విశాలాంధ్ర-పలాస : బాలల సంరక్షణకు కృషి చేస్తామని పలాస రైల్వే పోలీసులు అన్నారు. గురువారం పలాస రైల్వే స్టేషన్ ఆవరణ వద్ద రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ మరియు స్కిల్ డెవలప్మెంట్ ఐటీ ట్రైనర్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు 18 సంవత్సరముల లోపు బాలలు ఎక్కడైనా ఎప్పుడైనా ఆపదలో కనిపించినప్పుడు 1098 కు ఫోన్ చేసి సమాచారం తెలియజేస్తే బాలలకు రక్షణ మరియు సంరక్షణ కల్పించడం జరుగుతుందన్నారు.

వైసీపీని వీడి టిడిపిలో చేరిన కరకవలస

విశాలాంధ్ర-జలుమూరు : మండలం కరకవలసు మాజీ సర్పంచ్ బొంగు గోవిందరావు వైయస్సార్ పార్టీని వీడి గురువారం స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సమక్షంలో టిడిపిలో చేరారు. ఆయనకు పార్టీ కండువా వేసి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఆయనతోపాటు జడ్పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, శ్రీముఖలింగం కరకవలస లింగాలవలస సర్పంచులు తమన్న గారు సతీష్, గురుబిల్లి వెంకటరమణ, దుంగ స్వామి బాబు, మాజీ సర్పంచ్ తర్ర బలరాం, పొన్నాడ దాలయ్య, పలువురు టిడిపి నేతలు అభిమానులు పాల్గొన్నారు.

వైశాలి నగర్ ఎమ్మెల్యే రికేష్ సేన్ కు భిలాయి తెలుగు సమాజ్ సన్మానం

విశాలాంధ్ర-పలాస : భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు ఛత్తీస్ గడ్ తెలుగు మహా సంఘం ఉపాధ్యక్షుడు బర్రి జోగారావు, బైపల్లి గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ జర్నలిస్టు మద్దు నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గురువారం వైశాలి నగర్ ఎమ్మెల్యే రికేష్ సేన్ ను భిలాయ్ తెలుగు సమాజ్ సభ్యులు ఘనంగా సమర్పించారు. భిలాయి తెలుగు సమాజ్ కన్వీనర్ ఛత్తీస్ గడ్ తెలుగు మహా సంఘం సలహాదారులు మొరిపల్లి బాబూరావు ఎమ్మెల్యే కు మెమెంటో బహూకరించి సన్మానించారు. అనంతరం కేంప్ -1 ఆదర్శ నగర్ లో కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్న భిలాయి తెలుగు సమాజ్ భవనం మరమ్మతులు చేపట్టి పై అంతస్తు భవనం నిర్మాణం కోసం ఆర్థిక సహాయం కోరుతూ వినతిపత్రంను ఎమ్మెల్యేకు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే రికేష్ సేన్ సానుకూలంగా ప్రతిస్పందించి వీలైనంత త్వరగా డిమాండ్ ను నెరవేరుస్తామని హామి ఇచ్చారని బాబురావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతినిధి బైపల్లి రామారావు,కుట్టు కేంద్రం ఉపాధ్యాయురాలు జి.సునీతా, జి.శ్యామ్, ఎ.రీనా, ప్రధాన కార్యదర్శి యెరిపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కన్నం రాజేంద్ర, కేంప్ -1 ఇన్ ఛార్జ్ జి ఈశ్వరరావు, కోశాధికారి పి మురారి, సీనియర్ సలహాదారుడు , పూర్వ కౌన్సిలర్ జోలింగి కూర్మారావు, ఎం కె రావు, బైపల్లి అప్పారావు, టీ గున్నా రావు, కోనేరు ఎర్రన్న, అర్జాల వాసు దేవ్, వంక వెంకట రావు, చైతన్య ప్రభృతులు పాల్గొన్నారు.

ప్రపంచ ఖ్యాతి పొందిన 'రామన్' సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-నరసన్నపేట : ప్రపంచ ఖ్యాతిని పొందిన నోబెల్ ప్రైజ్ గ్రహీత, సి.వి.రామన్ సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపాల్, డా.జి.రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో సి.వి.రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన నివాళులర్పించారు. అనంతరం డా.రవికుమార్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రవేత్త, భారతరత్న సర్ సి.వి.రామన్ సామాన్య కుటుంబంలో పుట్టి, కృషి, పట్టుదలతో తన పరిశోధనలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందారన్నారు. కాంతి పరిక్షేపణపై చేసిన పరిశోధనలను రామన్ ఎఫెక్ట్‌గా పేరుగాంచాయని అన్నారు. అలాగే ఆకాశం, సముద్రం నీలి రంగులో ఉండుటకు కాంతి పరిక్షేపణా ధర్మంలో నీలిరంగు కాంతి తక్కువ తరంగదైర్ఘ్యం, ఎక్కువ పరిమాణంలో ఉండటమే కారణం అని పేర్కొన్నారని తెలిపారు. భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకులు, పి.ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ రామన్ ప్రాథమిక విద్యాభ్యాసం మన విశాఖపట్నంలో జరిగిందని, తన జీవితాన్ని మొత్తం పరిశోధనలకే అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ నమోదు గడువు

విశాలాంధ్ర-పాడేరు : నవంబరు 7 పేదలకు ఆర్థికంగా మేలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీపం 2.0 ఉచిత గ్యాస్ పొందడానికి వచ్చే మార్చి 31 లోగా లబ్ధిదారులు ఇకెవైసి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ స్పష్టం చేసారు. ఉచిత గ్యాస్ పంపిణీ ఇకెవైసీపై గురువారం ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు సరఫారా చేస్తారని చెప్పారు. లబ్ధిదారులకు ఆధార్ కార్డు, రైస్ కార్డు, ఎల్.పి.జి కనెక్షను ఉండి ఇకెవైసీ చేసుకోవాలని పేర్కొన్నారు. గ్యాస్ డోర్ డెలివరీ సిబ్బంది తో ఇకెవైసీ చేసుకునే అవకాశం ఉందన్నారు. లబ్ధిదారులు ముందుగా నగదు చెల్లించి గ్యాస్ సిలెండర్ విడిపించుకోవాలని చెప్పారు. సిలెండర్ తీసుకున్న తరువాత 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. దీపం, సి ఎస్ ఆర్, సాదారణ కనక్షన్లు, ఉజ్వల్ కనక్షన్లు కలిగిన లబ్ధిదారులకు దీపం పథకం 2.0 ఉచిత గ్యాస్ పంపిణీ వర్తింప చేస్తామన్నారు. ఏప్రిల్ నెల నుండి జూలై వరకు 1, ఆగస్టు నుండి నవంబరు వరకు 1, డిసెంబరు నుండి మార్చి నెల వరకు 1 సిలెండరును సరఫారా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 23 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 2 లక్షల 28 వేల 955 గ్యాస్ కనక్షన్లు ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు 1లక్ష 46 వేల 508 మంది లబ్ధిదారులకు ఇకెవైసీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో 34 ఇకెవైసీ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసామని చెప్పారు. అవసరమైన చోట అదనపు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డి ఎస్ ఓ బి. గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : చిలకపాలెంలోని 132/33 నిర్వహణ, ఇతర మరమ్మతుల కారణంగా ఈ నెల 8న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగీశ్వర రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొయ్యాం, ధర్మవరం, గుజరాతీపేట, పొన్నాడ సబ్ స్టేషన్ల పరిధిలో వివిధ గ్రామాలకు ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగ దారులు సహకరించాలన్నారు.

తెదేపా సభ్యత్వంతోనే ఆత్మగౌరవం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : తెదేపాలో సభ్యత్వం తీసుకోవడం అంటేనే ఆత్మగౌరవమని జిల్లా తెదేపా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి అన్నారు. మండలం బుడగట్లపాలెం గ్రామంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్నవారికి బీమా సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యకుడు, స్థానిక సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, గాదు రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చింతామణి అమ్మవారు 35వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కొజ్జిరియా గ్రామంలోని శ్రీ చింతామణి అమ్మవారు 35వ వార్షికోత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్సీ నర్తు రామారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టారు.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా నీలమణి దుర్గ ఆలయ 20వ వార్షికోత్సవం

విశాలాంధ-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామం పిరియావీధిలో నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ 20 వ వార్షికోత్సవాన్ని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఉద్దానం కళాకారులచే 24 గంటల అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.అలాగే కవిటి గ్రామం కు చెందిన పిరియా రవిప్రసాద్, ప్రశాంతి దంపతుల ఆర్థిక సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఎమ్మెల్యే అశోక్ ను శాలువాతో సత్కరించారు. పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

డీఎస్సీ రెండో బ్యాచ్ తరగతులు ఈనెల 11న ప్రారంభం

డీఎస్సీ మొదటి బ్యాచ్ విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేత

విశాలాంధ్ర-చింతపల్లి : డిఎస్‌సి 2వ, బ్యాచ్ తరగతులు ఈనెల 11 ఉదయం ఉచిత డెమో తరగతితో ప్రారంభమవుతాయని, తక్కువ ఫీజుతో అత్యుత్తమ బోధన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కింగ్స్ అకాడమీ సంస్థ చైర్మన్ బ్రదర్ డెన్నీ అన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు సిద్ధపడుతున్న నిరుద్యోగులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తాము నిర్వహించిన డి ఎస్ సి మోడల్ టెస్ట్ లో మొత్తం 35 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. వారిలో 130 మార్కులతో షేక్ రెహమా తునీషా ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు,119 మార్కులతో జల్లి బాబ్జి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.5 వేలు నగదు బహుమతులు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్మిన్ జోసెఫ్, ఇంచార్చ్ ప్రసాద్ పాల్గొన్నారు.

సొండికుల సంక్షేమానికి కృషి

కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు పాండవరామారావు

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటి శ్రీ చింతామణి ఆలయ ప్రాంగణములో కవిటి పంచాయతీ పరిధిలో గల సొండి కులస్తులతో సొండికుల శాశ్వత గౌరవ అధ్యక్షులు మొగిలిపురి సింహాచలపతి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కమిటీ ఎన్నిక నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యనిర్వహక కమిటీ అధ్యక్షులుగా పాండవ రామారావు, ఉపాధ్యక్షులుగా మొగిలిపురి నాగేశ్వరరావు, కార్యదర్శిగా మొగులపురి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా పాండవ తారకేశ్వరరావు, కోశాధికారిగా మొగలిపురి డిల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కదంబల ప్రశాంత్,కన్వీనర్గా మొగలిపురి సీతారాం, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా రత్నాల బలరామమూర్తి, కధంబాల శంకర్, సుధ, బంగారు ధనుంజయ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చింతామణి సొండికల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పోలవరం విద్యార్థులు ఎంపిక...

విశాలాంధ్ర-టెక్కలి: రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీహెచ్ఎస్ పోలవరం విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు విలియమ్స్ తెలియజేశారు. 8, 9,10 తేదీల్లో భీమవరంలో జరగబోయే అండర్ 17 విభాగంలో రోప్ స్కిప్పింగ్ క్రీడకు యమ్ యోగేశ్వరరావు ఎంపిక అవ్వగా, కడపలో జరగబోయే అండర్ 14 విభాగం రగ్బీ క్రీడలో కే శిరీష, కే అభిషేక్, ఏ వరుణ్ ఎంపిక అవ్వగా, 9,10,11 తేదీల్లో విశాఖపట్నం వేదికగా అండర్ 14 విభాగంలో నెట్ బాల్ క్రీడ నందు సాహూ కాజల్, ఎం చరణ్ రాష్ట్రస్థాయిలో జరగబోయే క్రీడల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీశ్వరరావు తెలియజేశారు. క్రీడాకారులు ఉత్తమప్రతిని కనపరిచి మంచి ఫలితాలు సాధించాలని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర-మందస : సమాజ సేవలో భాగంగా విశాఖపట్నం మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలం హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని అన్నారు. మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వైద్యం అవసరమైన వారికి మెరుగైన వైద్య సహకారం అందిస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాన్సర్ వైద్య శిబిరం కు నియోజకవర్గం నలుమూలల నుండి వందలాది మంది మహిళలు హాజరయ్యారు. రోగులకు డాక్టర్ సుకన్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి పి ఆర్ ఓ శివాజీ తో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలు

ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను



విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఈనెల 10వ తేది (ఆదివారం) శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలను నిర్వహిస్తున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను వెల్లడించారు. ఆ రోజున 38వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కూర్గీ, 13వ జిల్లా స్థాయి పూమ్ సే చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ పోటీలలో బాలురు, బాలికల విభాగాలలో నిర్వహించనున్నట్లుగా తెలియజేశారు. జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక చేయనున్నట్లుగా తెలిపారు. ఏడేళ్ళ నుంచి 11 యేళ్ళమధ్య వయస్సు ఉన్న క్రీడాకారులే ఈ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ పోటీలలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. జనవరి 1, 2013 నుంచి డిసెంబర్ 31,2017 మధ్య పుట్టిన క్రీడాకారులే ఈ పోటీలలో పాల్గొనవచ్చుని తెలియజేశారు. ఇతర వివరాల కోసం తైక్వాండో క్రీడాకారులు కోచ్ లు గౌతమ్ సెల్ నెంబర్ 8919591487,నవీన్ సెల్ నెంబర్ 9000655520లను సంప్రదించాల్సిందిగా తైక్వాండో శ్రీను కోరారు.

నామినేటెడ్ పదవులు నిజమైన గిరిజనులకు భర్తీ చేయాలి

చౌదరి లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-జలుమూరు : రాష్ట్రంలో కూటమిప్రభుత్వం రెండో విడతలో పంపిణీ చేయనున్న వలు కార్పొరేషన్ పదవుల్లో నిజమైన గిరిజనులకు న్యాయం చేయాలని నామినేటెడ్ పోస్టుల అందించాలని గిరిజన ఐక్యవేదిక నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ తో పాటు మరికొందరు డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో గిరిజనులు అయిదుగురు ఎమ్మెల్యేలను కట్టబెట్టి ఉన్నారని కాబట్టి కూటమి ప్రభుత్వం మీద మంచి అభిప్రాయం ఉందని అన్నారు. రెండో విడత నిజమైన గిరిజనులకు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టి మరింత గిరిజనులకు అభివృద్ధి చేయాలని గిరిజనుల కోరారు. ఆయనతోపాటు కార్యదర్శి జన్ని రామారావు, కార్యవర్గ సభ్యులు బి తులసయ్య, బి దండాసి, జయ, రామయ్య, జై శ్రీను, పలువురు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సి.వి.రామన్ : హెచ్ఎం బి మల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కవిటి: నేటి యువతరానికి ఆదర్శప్రాయుడు సివి రామన్ అని హెచ్ఎం బి. మల్లేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సివి రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి హెచ్ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలవేసి నివాళులు అర్పించారు. సివి రామన్ ఎఫెక్ట్ ద్వారా భౌతిక శాస్త్రంలో ఎనలేని కృషిచేసి ఫిజిక్స్ లో మొదటి నోబెల్ బహుమతి అందుకొని దేశానికి ఖ్యాతిని తెచ్చారని కొనియాడారు. భౌతికశాస్త్రం ఉపాధ్యాయిని తాళ్లూరి రాధిక మాట్లాడుతూ సివి రామన్ సేవలు దేశానికి ఎంతో గొప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకిరావు, వాసుదేవరావు, వెంకట్రావు, కృష్ణారావు, పీబీకే శర్మ,అరుణకుమారి, జ్యోతి కుమారి, గిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేని సంస్థలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న అన్ని ఎన్‌జిఒలు, సిఎస్ఆర్ మంజూరు చేసే కంపెనీలు లాభాపేక్ష లేని సంస్థల నుండి జిల్లా పరిపాలనలో చేరి అర్థవంతమైన మార్పును సృష్టించేందుకు ఆహ్వానిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫోరమ్‌కు జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థలు ఈఎన్‌జిఒ ఫోరమ్ లో చేరడానికి స్వాగతిస్తున్నామన్నారు. ఈనెల 8వ తేది నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభమవుతుందిని చెప్పారు.

పర్యాటక కేంద్రాలలో డస్ట్ బిన్‌లు ఏర్పాటు : పర్యాటక ప్రాంతాల్లో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయం నుండి పాడేరు,అనంతగిరి, అరకు వ్యాలీ, చింతపల్లి తాసిల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యటన ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు.

జీఓ నంబరు 3కు చట్టబద్ధత కల్పించండి : వైకాపా మండల అధ్యక్షుడు మల్లేష్

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : జీఓనంబరు 3కు చట్టబద్ధత కల్పించి గిరిజన నిరుగ్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వైకాపా మండల అధ్యక్షుడు చిక్కుడు. మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు అరకులో విచ్చేసిన ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీఓ నంబరు 3పునరుద్ధరణ చేపట్టి గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తామని హామినిచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత డీఎస్సీ ప్రకటనతో గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేకూరదన్నారు. ఇప్పటికైన గిరిజన ప్రాంతంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించి గిరిజన నిరుద్యోగులకు 100శాతం ఉద్యోగాల కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పంగి నర్సింగరావు, కార్యదర్శి భక్ . సింహాచలం, మండల వైసిపి నాయకులు అశోక్ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో "పోతల"

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో "పోతల దుర్గారావు బరిలో దిగనున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయ సంఘాల మద్దతు కోరారు. ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ సంఘ బాధ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి వివిధ సంఘాల జిల్లా ప్రతినిధులు మిత్ర సంఘాలు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం, బహుజన టీచర్స్ అసోసియేషన్, హెచ్ఎంస్ అసోసియేషన్,

మరియు యుటిఎఫ్, ఎస్ టి యు, ఏపీటీఎఫ్ 1938, డి టి ఎఫ్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, ఏపీ మోడల్ స్కూల్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం, హిందీ పండిట్స్, ఎస్సీ ఎస్టీ సర్పంచుల అసోసియేషన్ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పోతల దుర్గారావు కి మీ సంఘాల మద్దతు ఇవ్వవలసిందిగా వారిని కోరగా, హాజరైన సంఘాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. వారికి దుర్గారావు ధన్యావాదాలు తెలియజేశారు.

ఆల్ ఇండియా యోగా పోటీలకు బీఆర్ఏయూ జట్టు ఎంపిక

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: వచ్చే నెల 26 నుంచి 30వ తేదీ వరకు భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరగనున్న ఆల్ ఇండియా అంతర యూనివర్సిటీ యోగా పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తరపున పాల్గొనే జట్టు ఎంపిక వర్సిటీలో జరిగింది. వర్సిటీ అనుబంధ కళాశాలల

నుంచి 30 మంది హాజరుకాగా, పురుషులు, మహిళల విభాగం తరపున ఐదుగురు వంతన ఎంపిక చేశారు. వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, ట్రిపుల్ ఐటీ యోగా విభాగాధిపతి జి.ఈశ్వరరావు, వర్సిటీ పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ. భాస్కర్ పర్యవేక్షణలో జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: మండలం పరిధి భైరిపురం పీడర్ నందు చెట్లు కొమ్మలు తొలగించు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయింత్రం 3 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని డి.జి. పుట్టుగ,నెలవంక,కపాసుకుద్ది పంచాయతీలోని గ్రామాలకు గృహ కనెక్షన్లు, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగునని పలాస విద్యుత్శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళ మెడలో బంగారం చోరీ

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన సనపల సుజాత తన కొబ్బరితోటలో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా మర్గ మధ్యలో బైక్పై వచ్చిన వ్యక్తి తన మెడలో ఉన్న తులమున్నర బంగారం చైనును లాక్కొని పారిపోయారు.దీనిపై బాధితులురాలు కవిటి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

కోలవానిపాలెంలో రీసర్వే గ్రామసభ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని కోలవానిపాలెంలో గురువారం తహశీల్దార్ శ్యాంప్రసాద్ ఆదేశాలతో రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేపై రైతులకు ఎటువంటి అభ్యంతరాలున్నా సరి చేసుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వప్పల సోములమ్మ, శ్రీకాంత్, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రీ సర్వే ఏర్పాటు చేసి రికార్డులను సరి చేసే విధంగా ప్రభుత్వం మంచి నిర్ణయమని ఈ గ్రామ సభ ద్వారా రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని రికార్డులలో ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ గోవిందరావు, మాజీ సర్పంచ్ కట్టుమూరి సోమ నాయుడు, వైస్ సర్పంచ్ అప్పలరాజు, పప్పల శ్రీకాంత్ గుమ్మడి కాశి, గుంప శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న శ్రీనివాస సేవా సంఘం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామానికి చెందిన కొల్లి మురళి కి గుండె ఆపరేషన్ నిమిత్తం 25వేల రూపాయలు అందజేయడం

జరిగింది. ఈ సేవా సంఘం ఇప్పటికే చాలామందికి ఆర్థికంగాను, పేదవాళ్లకు దుప్పట్లు, ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం, ఇతర సామాజిక సేవలలో పాల్గొని మిగిలిన వారికి ఎంతో ఆదర్శవంతంగా నిలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, కార్యదర్శి మెహర్, పూర్వ ఉపాధ్యక్షుడు ఎం.చిరంజీవి, సభ్యులు సారిక శంకర్రావు, సంపంగి అప్పలరాజు, రౌతులపాలెం అయ్యప్ప స్వామి పీఠం గురు స్వామి ఎల్లయ్య, కంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటేరు బంద ఆక్రమణపై ఫిర్యాదు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధి బెల్లుపడా రోడ్డులో ఉన్న కోటేరు బంద ఆక్రమణకు గురైందని బెల్లుపడాకు చెందిన పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి ఆక్రమణలు తొలగించి చెఱువును అభివృద్ధి చేయాలని కోరారు. కొండా శంకర్, బడే దొరబాబు, దుర్గాసి పాపారావు, తిప్పన కూర్మారావు, బింగి యాదవరావు, గిన్ని వెంకట్ తదితరులు ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. దాంతో ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, జిల్లా కలెక్టర్‌లు బందను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానికులు బందలో 10.78 ఎకరాలు ఆక్రమణ జరిగినట్లు అధికారులు గుర్తించారని, ఆ ఆక్రమణలు తొలగించకుండానే చెఱువు అభివృద్ధి పనులకు పూనుకుంటున్నారని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు.

గ్యాస్ విస్తరణకు వ్యతిరేకంగా

సముద్రంలో పడవల ర్యాలీ

విశాలాంధ్ర - సాగర్ నగర్: ఆసియా గ్యాస్ విస్తరణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్క రించుకొని గురువారం సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం, రుషికొండ సముద్రంలో పడవలపై ర్యాలీ నిర్వహించారు. సమత, ఎంఎంఅండ్‌పీ, ఏపీఎండీడీ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పడవల ర్యాలీలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మత్స్యకారులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు పడవలపై ప్లే కార్డులు, బ్యానర్లు పట్టుకొని సముద్రంలో పడవల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమత కో-ఆర్డినేటర్ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ సముద్రంలో ప్లాస్టిక్ గణనీయంగా పెరుగుతోందన్నారు. ముఖ్యంగా పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ నియంత్రణ కొరవడిందన్నారు. దీని కారణంగా సముద్రం కలుషిత మవ్వడమే కాకుండా మత్స్యరాశులకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే సముద్రాల్లో వెలికితీస్తున్న గ్యాస్ విస్తరణ ప్రాజెక్టులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ వెలికితీత కారణంగా వాతావరణంలో సంభవిస్తున్న పెనుమార్పులు మత్స్యకారులంతా ఏటా ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ ఆసియా దేశాలు

గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలను ఎలా తగ్గించాలి అనే దానికంటే వేగంగా గ్యాస్ ప్రాజెక్టులు పెరుగుతూనే ఉన్నాయని వాపోయారు. సహజ వాయువు, ఎల్ఎన్జీ ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు నిలిపివేయాలని పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం అనంతవరం గ్రామానికి చెందిన కళ్లెంపూడి పార్వతి (48) అదే గ్రామంలో ఉన్న బంగారమ్మ తల్లి గ్రామ దేవత గుడి ప్రక్కన తన పొలం గట్టుపై పశువులకు గడ్డి కోస్తుండగా బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఒంటరిగా ఉన్న ఆమెను గమనించి మూడు తులాల బంగారం తాడు, ఆమె కుడి చెవికి ఉన్న ఆభరణాన్ని బలవంతంగా తెంచి, చోరీ చేశారు. దొంగలు అనంతవరం గ్రామం వైపు నుంచే వస్తూ ఈ దొంగతనానికి పాల్పడినట్టు బాధితురాలు తెలిపారు. దొంగలు చోరీ చేసిన బంగారు నగలు సుమారు రెండు లక్షల యాభైవేల రూపాయల విలువ ఉంటుందని బాధితురాలు తెలిపారు. జరిగిన సంఘటనపై బాధితురాలు పద్మనాభం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పద్మనాభం మండలంలో పోలీసులు మండల కేంద్రానికి దూరంగా ఉన్న తమ గ్రామాల వైపు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు మండలంలోని ప్రతీ గ్రామంలోనూ ముందు జాగ్రత్త హెచ్చరికలు జారీ చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో ప్రధాన ప్రాంతాల్లో రైతులకు నిరంతరాయంగా విధ్యుత్ అందించే లక్ష్యంతోనే కొర్లాం వద్ద విధ్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు జరుగుతున్నట్లు ఎమ్మేల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో జరిపిన 13 ఉప విధ్యుత్ కేంద్రాల శంఖుస్థాపనల్లో భాగంగా కొర్లాం విధ్యుత్ స్టేషన్ శంఖు స్థాపన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆధ్వర్యంలో ట్రాన్స్ కో ఎస్.ఈ ఏ.వి. రమణ, ఏ.పి.ఈ.పి.డి.సి.ఎల్ ఎస్.ఈ క్రిష్ణమూర్తి, శ్రీకాకుళం, విజయనగరం డి.ఈ.ఈలు మన్మధరావు, శ్రీనివాసరావుల తో నిర్వహించారు. కొర్లాంలో 132/33కె.వి ఉపకేంద్రం ఏర్పాటుతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 170గ్రామాలకు నిరంతరాయంగా విధ్యుత్ అందుతుందని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యలు ఉన్నాయని, రైతాంగం ఉన్నతికి కట్టుబడి వారికి ఇచ్చిన మాట మేరకు నిరంతరాయంగా విధ్యుత్ అందివ్వడానికి శరవేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, యుద్ధ ప్రాతిపదికన నిర్ణయాతు తీసుకుంటున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

తెలుపుకుంటున్నట్లు ఎమ్మేల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మేల్సీ నర్తు రామారావు , , తహశీల్దార్ వెంకట్రావు, పలువురు విద్యుత్ శాఖ అధికారులు, అధికార పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సి.ఎం. హామీలు పక్కాగా అమలు చేయాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్థానిక ఎమ్మేల్యే డాక్టర్ బెందాళం అశోక్, ఆర్డీఓలతో కలిసి స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో వివిధ స్థాయి అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గ పర్యటనలో అందిన వినతులను అధికారులు ఏ మేరకు పరిష్కరించారో విచారించారు. శుక్రవారం నాటికి ఏ ఒక్క పని పెండింగ్ ఉండరాదని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో డ్వామా ద్వారా చేయదగ్గ పనులపై గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో అంచానాలు రూపొందించి సాగు నీటి పథకాల కోసం తగిన చర్యలు తీసుకోవాలని, నిధులు కేటాయించడానికి సిద్ధమని స్పష్టం చేసారు. బెంతొరియాలకు నేటివిటీ సర్టిఫికేట్ల జారీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలో బాహుదా నదిపై 11 గ్రోయిన్ల మరమ్మత్తు పనులు 21కోట్ల రూపాయలతో చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు సి.ఎం. ఇచ్చిన హామీలు పక్కాగా అమలయ్యేలా అధికార యంత్రాగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. రబీ పంటకాలానికి రాయితీపై ఇచ్చే ఆరుతడి పంటల విత్తనాలను నియోజక వర్గానికి చెందిన పలు రైతులకు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కే జగన్ మోహన్ రావు, మండల వ్యవసాయ అధికారులు బి .నరసింహమూర్తి, దుర్గాప్రసాద్ తదితరులతో కలిసి అందజేసారు. అధిక దిగుబడి ఉద్దేశించి వేరుశనగ, మినుము విత్తనాలు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్నందున వ్యవసాయ శాఖ సూచనలతో రైతులు అధిక దిగుబడులకు దోహదపడాలని, ఉత్సాహంగా సాగు చేసి సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి దృష్టి సారించండి

స్థానికంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ మున్సిపల్ కార్యాలయంలో దాదాపు రెండు గంటల పాటు మున్సిపాలిటీ సిబ్బందితో స్థానిక పరిస్థితులపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఎమ్మేల్యే డాక్టర్ బెందాళం అశోక్, మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కమీషనర్ ఎన్. రమేష్, ఆర్డీఓలతో కలిసి గురువారం నిర్వహించిన సమీక్షలో స్థానికంగా ఆదాయం పెంచుకునే మార్గాలు చూడాలని, కాలువలు, వీధి దీపాలు, రోడ్లు బాగు చేసుకోవడంతో పాటు రోడ్ల పై పశువులు, కోతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.